ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
3
శనివారం 17 ఆగస్టు 2024

గాడి తప్పిన ఆర్టీసీని తిరిగి రోడ్డెక్కిస్తా : మంత్రి


మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి

కడప(మారుతీ నగర్), ఆగస్టు 16: గాడి తప్పిన ఆర్టీసీని తిరిగి రోడ్డెక్కించి సరైన దిశలో ముందుకు సాగేలా చేస్తామని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం కడప ఆర్ఎం కార్యాలయ ఆవరణలో గల ఆర్టీసీ గెస్ట్‌హౌస్‌లో ఆయన మాట్లాడారు. గత ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో ఆర్టీసీ అవినీతి ఊబిలో కూరుకుపోయిందని.. నిష్పక్షపాతంగా విచారణ జరిపించి ఆర్టీసీని కొత్త పుంతలు తొక్కిస్తామన్నారు. కొత్త బస్సులు తెచ్చే విషయంలో ఫైనల్ స్టేజ్‌లో ఉన్నాయని తెలిపారు. పక్క రాష్ట్రాలతో మన ఆర్టీసీని బేరీజు వేసుకోవడం సరైంది కాదన్నారు. పక్కరాష్ట్రాల్లో ఆర్టీసీ కార్పొరేషన్ స్థాయిలో నడుస్తుందనే సంగతి గుర్తెరగాలన్నారు. అదే మన రాష్ట్రంలో ఆర్టీసీ గవర్నమెంటు పరిధిలో నడుస్తుందని.. జీతభత్యాలు కూడా ప్రభుత్వమే ఇస్తుందన్నారు. ఆర్టీసీలో ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అందుకు వీలుగా ఫిట్‌మెంటు లేని బస్సులను పూర్తిగా నిలుపుదల చేస్తామని తెలిపారు. గవర్నమెంటు, టూరిస్టు, స్కూలు బస్సుల ఫిట్‌నెస్‌ను నిశితంగా పరిశీలించేలా స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నట్లు వెల్లడించారు. సమావేశంలో ఆర్టీసీ కడప రీజనల్ మేనేజరు గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదల ఇళ్ల నిర్మాణాలు నాణ్యతతో చేపట్టాలి : కలెక్టర్

కడప(కలెక్టరేట్), ఆగస్టు 16: పేదల ఇంటి కల సాకారం చేసే దిశగా హౌసింగ్ పథకంలో ఎలాంటి పెండింగ్ లేకుండా గృహ నిర్మాణాలను నాణ్యతతో పూర్తి చేయాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పేదల గృహ నిర్మాణాల ప్రక్రియపై సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే గృహాలు మంజూరై, ఇంటి నిర్మాణాల ప్రక్రియలో వెనుకబడిన ప్రాంతాల్లో త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. కాంట్రాక్టర్లు రాజీలేకుండా నాణ్యతతో పనులు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన ఇసుక పాలసీకి లోబడి ఇసుకను సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఇసుక అవసరమైన లే-అవుట్లలో పనులు చేపడుతున్న కాంట్రాక్టర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇసుకను సరఫరా చేస్తామన్నారు. మెటీరియల్, లేబరు, కాంపోనెంట్, బిల్లుల పెండింగ్, ఇసుక, ఇనుము, నీరు, రోడ్లు తదితర అంశాలపై సమీక్షించారు. గృహ నిర్మాణ పనుల విషయంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తేవాలన్నారు. త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలపాలని సూచించారు. పేదలకు హౌసింగ్ పథకంలో మున్సిపాలిటీలు, మండల స్థాయిలో నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ కృష్ణయ్య, డ్వామా ఇన్‌చార్జి పీడీ జోయల్ విజయకుమార్, నగర కమిషనరు వైవో నందన్, అదనపు కమిషనరు రాకేష్, మున్సిపల్ కమిషనర్లు, డీఈలు, ఏఈలు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ విమలమ్మ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి

ఆక్రమణలో... మడూరు కాలువ

ప్రొద్దుటూరు డ్రైనేజీ వ్యవస్థకు గుండెకాయ వంటి మడూరు కాలువ రోజురోజుకు ఆక్రమణకు గురవుతోంది. పట్టణం మాత్రం రోజు రోజుకు విస్తరిస్తోంది. ఈ నేపథ్యంలో సరైన డ్రైనేజీ మార్గం లేక వర్షపు నీరు, మురుగునీరు ఎక్కడ పడితే అక్కడే నిలిచిపోయి ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. మండల పరిధిలోని పెద్దశెట్టిపల్లె నుంచి కొత్తపేట, చౌటపల్లె, దొరసానిపల్లె ద్వారా మున్సిపాలిటీ గుండా 60 అడుగుల విస్తీర్ణంలో ప్రవహించే ఈ వర్షపు నీటి కాలువ కిలో మీటర్ల పొడవునా వుంది. చాపాడు మండలం మడూరు చెరువు వరకు సాగి.. అక్కడ చెరువులో కలిసి పోతుంది. గతంలో ఇది ఇరిగేషన్ కాలువగా వుండేది. పట్టణం అభివృద్ధి చెందే కొద్దీ ఈ కాలువే ప్రొద్దుటూరు పట్టణానికి ప్రధాన డ్రైనేజీ వ్యవస్థకు మూలమైంది. ఈ కాలువ 60 అడుగుల మేర విస్తీర్ణం నుంచి నేడు 10 అడుగుల మేర మాత్రమే మిగిలింది. దాదాపు కిలో మీటర్ల కొద్దీ 50 అడుగుల మేర కాలువ ఆక్రమణకు గురైంది.


కాలువ అప్రోచ్ రోడ్డు స్థలంలో ప్రైవేటు వెంచర్ రోడ్డు


మడూరు కాలువలో పైపులు వేసి రోడ్డు మార్గం వేసుకున్న దృశ్యం

- 60 అడుగుల నుంచి 10 అడుగులకు చేరిన వైనం
- అప్రోచ్ రోడ్డు స్థలం ఆక్రమించి కట్టడాలు
- మార్కింగ్ ఇస్తే.. బయటపడనున్న అక్రమ కట్టడాలు
- పట్టించుకోని రెవెన్యూ, మున్సిపల్ అధికారులు

ప్రొద్దుటూరు, ఆగస్టు 16: పట్టణంలో ప్రవహించే ప్రొద్దుటూరు చానల్ 1, చానల్ 2, దొరసానిపల్లె, కొత్తపల్లె కాలు వలు అన్నీ కూడా మడూరు కాలువలో కలిసి పోతాయి. పెద్దశెట్టిపల్లె నుంచి వచ్చే ఈ కాలువ రైల్వే స్టేషన్‌రోడ్డు దాటి చౌటపల్లె వెళ్లే మార్గంలో పూర్తిగా ఆక్రమణకు గురైంది. ఇప్పటికే అక్కడ ప్రైవేటు లేఅవుట్ యజమానులు పలు దఫాలుగా కాలువను పూడ్చి వేశారు. కాలువ ప్రైవేటు స్థలంలో ప్రవహిస్తోందని.. అసలైన కాలువ స్థలం ఆక్రమణకు గురైందని ప్రైవేటు లేవుట్ యజమానులు ఆరోపిస్తున్నారు. చౌటపల్లె గ్రామంలో ఈ కాలువ మీదనే పెద్ద పెద్ద భవంతులు నిర్మించి కాలువ రూపమే లేకుండా చేశారు. భవిష్యత్తులో చౌటపల్లె, పెద్దశెట్టిపల్లె, దొరసానిపల్లెలు మున్సిపాలిటీలో విలీనం కావాల్సిన గ్రామాలు. ఇప్పుడే ఈ గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా ఆక్రమణకు గురైతే.. భవిష్యత్తులో అవస్థలు తప్పవని పలువురు హెచ్చరిస్తున్నారు.



దొరసానిపల్లెలో జంబులమ్మ గుడివద్ద...

దొరసానిపల్లెలో జంబులమ్మ గుడివద్ద మడూరు కాలువ ఆక్రమణకు గురైంది. ముఖ్యంగా ఈ కాలువ స్థలంలో గుడి నిర్మించారు. దీన్ని సాకుగా చేసుకుని జంబులమ్మ గుడి వెనుక కాలువ ఆక్రమణకు గురవుతోంది. ఇప్పటికే 20 మీటర్లు ఉన్న ఈ కాలువ ఆక్రమణలతో మూడు మీటర్లకు కుంచించుకుపోయింది. అక్కడి నుంచి కాలువ అప్రోచ్ రోడ్డును ఆక్రమించి ఇళ్లను నిర్మించారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలో క్విన్‌మేరిస్ స్కూలు వద్ద మడూరు కాలువను ఆక్రమించి ప్రైవేటు స్థలాల్లో నిర్మించినట్లు స్థానికులు చెబుతున్నారు. అసలు కాలువ స్థలం క్విన్‌మేరిస్ స్కూలు కాంపౌండు మార్గాన వెళుతుందని సర్వేయర్లు చెబుతున్నారు. దీంతో గతంలో నిర్మించిన మడూరు కాలువకు అప్రోచ్ రోడ్డు లేక దొరసాని పల్లె నుంచి హనుమాన్‌నగర్ వద్ద నిలిచిపోయింది. మడూరు కాలువ అనుకుని క్విన్ మేరిస్ స్కూలు నిర్వాహకులు బాతురూంలు నిర్మించారు. దీంతో హనుమాన్‌నగర్ నుంచి మార్గం బంద్ అయ్యింది. తూర్పువైపు బాలాజీ స్కూలు వాళ్లు కూడా కాలువను ఆక్రమి ంచి నిర్మించారని ఇటీవల సర్వేయర్లు వేసిన కొలతలు వెల్లడిస్తున్నాయి. ఇక క్విన్‌మేరిస్ స్కూలు వద్ద మడూరు కాలువలో పైపులు వేసి అక్రమంగా కల్వర్టు నిర్మించారు. దీంతో కాలువలో వర్షపు నీరు వెళ్లాలంటే అడ్డంకిగా మారింది. అంతేకాకుండా వ్యర్థాలన్నీ అక్కడ నిలిచి పోయాయి. పూడికతీత పనులకు ఆటంకాలు ఏర్పడి...

> **మడూరు కాలువ ఆక్రమణపై సర్వే చేయిస్తాం**
>
> ప్రొద్దుటూరుకు కొత్తగా వచ్చాను. మడూరు కాలువ ఆక్రమణపై చౌటపల్లె, దొరసానిపల్లె గ్రామాల పరిధిలో వీఆర్‌వో, సర్వేయర్లుతో టీంలు వేసి సర్వే చేయిస్తాం. కాలువ ఆక్రమణలను గుర్తించి నివేదిక రూపొందిస్తాం. మున్సిపల్, పంచాయతీ అధికారులతో కలిసి చర్యలు తీసుకుంటాం.
>
> - వండాడి గంగయ్య, తహసీల్దారు, ప్రొద్దుటూరు

మున్సిపాలిటీ వారు పూడిక తీత పనులు చేపట్టడం లేదు. దీంతో ఈ ప్రాంతంలో కాలువలో మురుగు నిలిచిపోయి దోమలు వ్యాప్తి చెంది దాడిచేస్తున్నాయి. ఇక మడూరు కాలువ చౌటపల్లె నుంచి మొదలు దొరసానిపల్లె మున్సిపాలిటీ ఏరియాలో మొత్తం వందలాది కట్టడాలు అక్రమంగా నిర్మించారని.. మార్కింగ్ ఇస్తే వందలాది అక్రమ కట్టడాలు బయటపడతాయని రెవెన్యూ, మున్సిపల్ అధికారులు వెల్లడిస్తున్నారు.

దొరసానిపల్లె జంబులమ్మ గుడి నిర్మాణంతో పిల్లకాలువగా మారిన మడూరుకాలువ


కాలువ అప్రోచ్ రోడ్డు లేకుండా కట్టడాలు నిర్మించిన ప్రైవేటు స్కూలు

గ్లైఫోసెట్... యమ డేంజర్

రైతులకు పంట పొలాల్లో కలుపునివారణ తలకు మించిన భారమవుతోంది. కూలీల కొరత తీవ్రంగా ఉండడం.. ఒకవేళ కూలీలు దొరికినా కూలీ డబ్బులు ఎక్కువ ఇవ్వాల్సి వస్తుం డటంతో రైతులు ఎక్కువగా కలుపును నివారించేందుకు గడ్డి మందులపై మొగ్గు చూపు తున్నారు. దీన్ని ఆసరగా చేసుకున్న పురుగు మందు దుకాణదారులు నిషేధిత గడ్డిమందు (గ్లైఫోసెట్)ను అధిక డబ్బులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ గడ్డిమందు వాడడం వల్ల నేల స్వభావం కోల్పోవడంతో పాటు అనేక దుష్పరిణామాలు ఉంటాయని తేలింది. దీనిపై పూర్తిగా అవగాహన లేని రైతులు విచ్చల విడిగా వాడుతున్నారు. చర్యలు చేపట్టాల్సిన సంబంధిత అధికారులు మామూళ్లమత్తులో చూసీ చూడనట్లు వ్యవహరిస్తు న్నారనే అరోపణలు ఉన్నాయి.


పులివెందులలోని విచ్చలవిడిగా దొరుకుతున్న గ్లైఫోసెట్

- విచ్చలవిడిగా.. నిషేధిత గడ్డి మందు విక్రయాలు
- అవగాహన లేక వాడుతున్న రైతులు
- ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ ద్వారా సరఫరా
- తమిళనాడు, కర్ణాటక నుంచి దిగుమతులు
- వ్యవసాయ అధికారుల తనిఖీలపై ఆరోపణలు


పులివెందులలో వ్యవసాయ శాఖ అధికారులు చేస్తున్న తనిఖీల తీరు (ఫైల్)

పులివెందుల రూరల్, ఆగస్టు 16: పులివెందుల పరిధిలోని రసాయన, పురుగుమందుల దుకాణాల్లో ప్రమాదకర, నిషేధిత గడ్డిమందు (గ్లైఫోసెట్) విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్లైఫోసెట్ మందును నిషేధించాయి. ఈ గడ్డి మందు వాడితే.. నేల స్వభావం కోల్పో వ డం.. మనుషుల ఆరోగ్యంపై దుష్పరిణామాలు ఎక్కువగా ఉంటాయని తేలింది. ఎంతో మంది ఊపిరితిత్తులు, క్యాన్సర్ బారిన పడి చనిపోయినట్లు పలు నివేదికలు వెల్లడించాయి. అయినా కాసులకు కక్కుర్తి పడి ఎరువులు, పురుగుమందుల దుకాణాలలో నిషేధిత కలుపునివారణ మందులను విక్రయిస్తూ జేబులు నింపుకుంటున్నారు. వీటిని నివారించాల్సిన వ్యవసాయశాఖ అధికారులకు నెలనెల మామూళ్లు అందుతుండడంతో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మీరు ఏమైనా చేసుకోండి ..మా కంట పడితే మాత్రం షాపులను సీజ్ చేస్తామని ముందుగానే హెచ్చరించినట్లు పలు దుకాణాదారులే బహిరంగంగా చెబుతున్నారు. దీన్నిబట్టి నిషేధిత రసాయనాలు అమ్ము కోండని చెప్పకనే చెబుతున్నట్లు స్పష్టమవుతోంది.

హెచ్చరికలు పట్టించుకోని వ్యవసాయశాఖ

గ్లైఫోసెట్ కేవలం గడ్డిని మాత్రమే చంపేస్తుందనుకుంటే పొరపాటే. దీన్ని వాడడం వలన నేల సారవంతం తగ్గిపోయి తన స్వభావాన్ని కోల్పోతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ గడ్డిమందు అవశేషాలు మొక్కలను విషంగా మార్చుతుందని... మనుషులపై తీవ్ర ప్రభావం చూపుతుందని... ఊపిరితిత్తులు, కిడ్నీలు చెడిపోవడంతో పాటు క్యాన్సర్ బారిన పడుతున్నట్లు చెబుతున్నారు. ఇది ప్రమాదికారి అని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏడేళ్ల క్రితం బ్యాన్ చేశాయి. గ్లైఫోసెట్ ఎక్కడైనా కనిపిస్తే వెంటనే స్వాధీనం చేసుకోవాలని, షాపులు సీజ్ చేసి కఠినంగా వ్యవహరించాలని హెచ్చరికలు జారీ చేశాయి. అయినప్పటికీ మార్కెట్‌లో గ్లైఫోసెట్ మందు విచ్చలవిడిగా కనిపిస్తోంది. అంటే సంబంధిత అధికారుల తనిఖీల తీరు ఎలా ఉందో ఇట్టే అర్థమవుతుంది. అప్పుడప్పుడు దుకాణాలకు వెళ్లి తూతూమంత్రంగా రికార్డులు, మందులను పరిశీలిస్తూ మమ అనిపిస్తున్నట్లు స్పష్టమవుతోంది.

ట్రాన్స్‌పోర్టుల ద్వారా...

ఈ గ్లైఫోసెట్ మందును ఎక్కువగా తేయాకు తోటలు సాగుచేసే రాష్ట్రాలు బ్యాన్ చేయలేదు. వాటిలో తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు ఉన్నాయి. ఈ రాష్ట్రాలు పులివెందుల ప్రాంతానికి చేరువలోనే ఉండడంతో అక్కడ నుంచి ఎక్కువగా దిగుమతులు ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో పులివెందులకు గ్లైఫోసెట్ మందును పలు ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టుల ద్వారా, ప్రైవేటు బస్సుల ద్వారా తీసుకువస్తున్నట్లు సమాచారం.

కఠిన చర్యలు తీసుకుంటాం

- అంబవరం ప్రభాకర్‌రెడ్డి, ఏడీఏ, పులివెందుల

నిషేధిత గ్లైఫోసెట్ మందు ఎక్కడైనా కనిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. అందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ఇందుకు అధికారులు సహకరిస్తున్నట్లు తేలితే వారిని సస్పెండ్ చేసేందుకు వెనుకాడం. గ్లైఫోసెట్ వలన కలిగే దుష్పరిణామాలపై రైతులకు అవగాహన కల్పిస్తాం. తాను ఇటీవలే నూతనంగా బాధ్యతలు చేపట్టాను. గ్లైఫోసెట్ నిర్మూలనకు కఠినంగా వ్యవహరిస్తాం.

జిల్లాలో పలువురు సీఐల బదిలీలు

కడప(క్రైం), ఆగస్టు 16: జిల్లాలో పనిచేస్తున్న సీఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సీఐ	ప్రస్తుతం	బదిలీ అయిన ప్రదేశం
సి.భాస్కర్‌రెడ్డి	వీఆర్, కడప	సీసీఎస్-1, కడప
చాంద్‌బాషా	వీఆర్, కడప	సీసీఎస్-2, కడప
సుబ్బరామిరెడ్డి	నగరి రూరల్	కడప రూరల్
నాగరాజు	కడప రూరల్ సర్కిల్	వీఆర్, కడప
ఎస్.రోషన్	యాడికి	కమలాపురం
శంకర్‌రెడ్డి	వీఆర్, కడప	ఆర్ఎస్‌టీఎఫ్, కడప
కరుణాకర్	వీఆర్, కడప	ఏహెచ్‌పీయూ, కడప
మధుమల్లేశ్వర్‌రెడ్డి	ఏహెచ్‌పీయూ, కడప	సైబర్ క్రైమ్
కె.రమణారెడ్డి	వీఆర్, కడప	ఫ్యాక్షన్ జోన్, ప్రొద్దుటూరు
నరేంద్రరెడ్డి	వీఆర్, అనంతపురం	సీసీఆర్, కడప
వెంకటకుమార్	దిశ , కడప	డీఎస్‌బీ, కడప
ఎం.క్రిష్ణారెడ్డి	వీఆర్, చిత్తూరు	దిశ, కడప
మహ్మద్‌బాబా	వీఆర్, కడప	డీటీఆర్‌బీ, కడప
ఏపీ మస్తాన్	వీఆర్, కడప	ఎస్సీ ఎస్టీ సెల్, కడప



ఘనంగా వరలక్ష్మీ వ్రతం

ఒంటిమిట్ట, ఆగస్టు 16: ఒంటిమిట్ట కోదండ రామాలయంలో టీటీడీ అర్చకులు, అధికారులు సామూహిక వరలక్ష్మీవ్రతాన్ని నిర్వహించారు. ముందుగా ఉత్సవమూర్తులైన సీతారామ లక్ష్మణులను ప్రత్యేకంగా అలంకరించి రామాలయంలో మండపం వద్ద ఉంచి పూజలు ప్రారంభించారు. కుంకుమ, లక్ష్మీదేవి ప్రతిమ, జాకెట్ మహిళలకు అందజేసి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవారి అనుగ్రహం ప్రతి ఒక్కరిపై ఉండాలని, అందరూ సుఖ సంతోషాలతో గడపాలని వరలక్ష్మీవ్రతాన్ని చేసినట్లు పూజారులు తెలిపారు. అనంతరం మహిళలందరికీ పసుపు, కుంకుమ, గాజులను అర్చకులు అందజేశారు. కార్యక్రమంలో టీటీడీ అర్చకులు వీణారాఘవాచార్యులు, మనోజ్‌కుమార్, టీటీడీ ఇన్‌స్పెక్టర్ నవీన్, సిబ్బంది వినోద్ తదితరులు పాల్గొన్నారు.


కోదండరామాలయంలో వరలక్ష్మీ వ్రతాన్ని చేస్తున్న అర్చకులు

ఆ స్టేషన్‌లో అంతా ఏకపక్షమే...

● సివిల్ పంచాయితీలే లక్ష్యం ● వైసీపీ పాలనలో అసాంఘిక కార్యక్రమాలకు వత్తాసు
● దందాల అడ్డాగా మారిన రైల్వేకోడూరు పోలీస్‌స్టేషన్ ● కార్లు, భవనాలు కొనుగోలు వేసిన వైనం


వంకపోరంబోకు స్థలంలో అక్రమ కట్టడాలను అడ్డుకునేందుకువచ్చే గ్రామస్థులను అడ్డుకుంటున్న పోలీసులు (ఫైల్ ఫొటో)

రైల్వేకోడూరు, ఆగస్టు 16: ఏక పక్షమై పోలీసుల పర్వంలో సివిల్ పంచాయతీలే లక్ష్యంగా, అసాంఘిక కార్యకలాపాలకు వత్తాసు పలుకుతూ రైల్వేకోడూరు పోలీసు స్టేషన్‌ను దందాల స్టేషన్‌గా మార్చారు అధికారులు. విలాసవంతమైన జీవితం అనుభవించేందుకు ఇదొక మార్గంగా ఎంచుకోవడం చూస్తే ఔరా అనిపిస్తోంది. వైసీపీ పాలనలో పోలీసులు ఏకపక్షంగా పంచాయతీలు చేసి వచ్చిన డబ్బుతో కొత్త కార్లు, భవనాలు కొనుగోలు చేశారని విమర్శలున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో అసాంఘిక కార్యక్రమాలకు పోలీసుల సహకారం అంతాఇంతా కాదు. గంజాయి, పేకాట, మట్కా, ఎర్రచందనం అక్రమ రవాణా తదితర అసాంఘిక కార్యక్రమాలు అడ్డూఅదుపు లేకుండా జోరుగా సాగాయి. ఐదేళ్ల రైల్వేకోడూరు పోలీస్‌స్టేషన్‌లో దందాలు అత్యధికంగా సాగాయి. చిన్న కార్యకర్త మొదలు పెద్ద నేత వరకు చెప్పిన పనులు ఏకపక్షంగా చేసి బాధితుల నుంచి ఇరు వైపులా డబ్బు తీసుకున్న సందర్భాలూ ఉన్నాయనే అపవాదు ఉంది. వివరాల్లోకి వెళితే....

రైల్వేకోడూరు పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై రావాలంటే గతంలో ఎవరూ వచ్చే వారు కాదు. అయితే రైల్వేకోడూరు పోలీస్‌స్టేషన్‌లో ఎక్కువగా పంచాయితీలే జరుగుతాయనేది ప్రతీతి. దీంతో మొదట చిత్తూరు జిల్లా పోలీసులే ఎక్కువగా రైల్వేకోడూరుకు వచ్చేవారు. కాని అది కాస్త తగ్గి కర్నూలు వైపు మళ్లింది. ప్రస్తుతం కర్నూలు జిల్లా పోలీసులే ఎక్కువగా ఇక్కడికి బదిలీపై వస్తున్నారు. క్రమేణా పోలీస్‌స్టేషన్‌లో పంచాయతీలు పుంజుకున్నాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైల్వేకోడూరు పోలీస్‌స్టేషన్‌లో పంచాయతీలు ఎక్కువయ్యాయి. బాధితులకు అండగా ఉండాల్సిన పోలీసులు వైసీపీ నేతలు, కార్యకర్తలకు అండగా నిలిచారు. వైసీపీ నుంచి ఫోన్ కాల్ వచ్చిందంటే చాలు న్యాయమైన వారికి బెదిరింపులు వస్తాయి. సివిల్ పంచాయితీలు అంటూ బయటే మాట్లాడుకోవాలనడం, బాధితులను కేసుల్లో ఇరికిస్తామని బెదిరించి ఇద్దరి వద్ద పైసలు లాక్కునే వారు. ఈ తంతు ఐదేళ్ల పాటు నిర్విరామంగా జరిగింది. డబ్బు సంపాదించిన పోలీసులు కార్లు, భవనాలు తీసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో అసలైన బాధితులకు న్యాయం జరగలేదు. అంతకాకుండా గంజాయి అమ్మకాలు విపరీతంగా జరిగాయి. అధికారులు దాడులు చేసిన దాఖలాలు లేవు. నామమాత్రంగా ఆరుగురిపై కేసులు నమోదు చేసి చేతులు దులిపేసుకున్నారు. అత్యంత విలువైన, అరుదైన ఎర్రచందనం అక్రమ రవాణాలో పోలీసుల పాత్ర కీలకంగా ఉన్నాయని ఆరోపణలు వినిపించాయి. వైసీపీ నేతలు, వారి సోదరులు, ద్వితీయ శ్రేణి నేతలు పెద్దఎత్తున పేకాట నడిపించారు. పేకాటలో చాలా మంది డబ్బు పోగొట్టుకుని బికార్లు అయ్యాయి. మట్కా ఆడేవాళ్లకు వైసీపీ వత్తిడితో పోలీసులు మామూళ్లు తీసుకున్నారని ఆరోపణలు వినిపించాయి. ఐదేళ్లలో గంజాయి, పేకాట, ఎర్రచందనం, మట్కా తదితర అసాంఘిక కేసులు నామమాత్రంగా నమోదయ్యాయే తప్ప నిజంగా అసాంఘిక కార్యక్రమాలు ఎవరు చేస్తున్నారు, ఎలా వస్తున్నాయి, ఎవరి ప్రమేయం ఉంది అనేది లోతుగా విచారణ చేసిన దాఖలాలు లేవు. ఐదేళ్లలో పోలీసులు వైసీపీకి తొత్తులుగా పని చేశారే తప్ప ప్రజా వినతులు చూసి న్యాయం చేయలేదు. ఇక పోతే భూ పంచాయతీల్లో తలదూర్చి డబ్బు గుంజుడు. సివిల్ పంచాయితీలు చేయకూడదని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించినా ప్రయోజనం లేకపోయింది. పంచాయితీలు చేసి డబ్బు సంపాదించుకోవాలన్న తపనలోనే నిమగ్నమైపోయారు. వైసీపీ కార్యకర్తలు, నేతలు రేబాన్ అద్దాలు, చేతులకు కడియాలు, మంచి సెంటు వాసనతో వచ్చి కూర్చుని పోలీస్‌స్టేషన్‌లో దందాలు చేశారు. ఐదేళ్లలో పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన మహిళలు, రైతులు, వ్యాపారులు తదితర రంగాల వారు న్యాయం జరగక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. పోలీస్‌స్టేషన్‌లో పంచాయతీలు నామమాత్రంగా చేసి ఇరు వర్గాలను బయటి ప్రాంతాలకు పిలిపించుకుని ముక్కుపిండి వసూలు చేసిన సంఘటనలు చాలా ఉన్నాయి. ఇదిలా ఉండగా గత మండల పరిషత్ ఎన్నికల్లో పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించారు. దీంతో పోలీసులపై నమ్మకాలు ప్రజలకు సన్నగిల్లాయి. రాజంపేట డీఎస్పీని వైసీపీ నేత ఒకరు బూతుపురాణం చేశారు. టీడీపీ తరపున వేసిన నామినేషన్లను వెనక్కితీసుకునేలా పోలీసులు ప్రత్యేక పాత్ర పోషించారు. మండల పరిషత్ కార్యాలయంలో టీడీపీ నేతలు, కార్యకర్తలపై దౌర్జన్యం జరుగుతున్నా పోలీసులు వైసీపీ కే అండగా నిలిచారు. పంచాయతీ ఎన్నికలు కూడా పోలీసుల కనుసన్నల్లోనే జరిగాయి. ఏకపక్షంగా ఎన్నికలు జరిగేందుకు పోలీసులు ముమ్మరంగా ప్రయత్నించారు. వైసీపీకి కొమ్ముకాసి పంచాయితీ ఎన్నికల్లో రిగ్గింగుకు అవకాశాలు కల్పించారని టీడీపీ దుమ్మెత్తిపోసినా పోలీసు వ్యవస్థ పట్టించుకోలేదు. వైసీపీ పాలనలో కొందరు పోలీసు అధికారులు కోట్లు సంపాదించుకున్నారని బహిరంగంగా చర్చించుకున్నారు. రైల్వేకోడూరులో ఇదేంది అన్ని ప్రశ్నించిన జర్నలిస్టులను కూడా బెదిరించారు. మైసూరివారిపల్లె పంచాయతీలో వంక పోరంబోకు స్థలంలో అక్రమంగా కట్టడాలు జరుగుతున్నాయని గ్రామస్థులు అడ్డుకున్నందుకు వారిపై కేసులు నమోదు చేయడానికి సైతం వెనకాడలేదు. కోర్టు ఆర్డర్లు ఉన్నా పోలీసులు అక్రమ నిర్మాణాలు చేస్తున్న వారికే పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయించి దగ్గరుండి కట్టించారు. ఏకపక్ష నిర్ణయాలు, పంచాయితీలు, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన పోలీసులు వ్యవస్థను భ్రష్టుపట్టించారనే విమర్శలు వెల్లువెత్తాయి. టీడీపీ, జనసేన తదితర నేతలను అక్రమ అరెస్టులు చేశారు. చంద్రబాబ అరెస్టును నిరసిస్తూ రైల్వేకోడూరులో టీడీపీ ఆధ్వర్యంలో శాంతియుతంగా నిరసన చేస్తున్న 13 మందిపై అక్రమ కేసులు నమోదు చేశారు. ఇప్పటికీ వైసీపీ సానుభూతి కలిగిన పోలీసులు స్వామి భక్తిని ప్రదర్శించడం, ఇంకా పాత పద్ధతులను అవలంబించడం, కూటమి అధికారంలోకి వచ్చినా వైసీపీని మరిచిపోక చాటుమాటుగా జరుతుండడం కొసమెరుపు.



రైల్వేకోడూరు పోలీస్‌స్టేషన్ - టీడీపీ నేత అక్రమ అరెస్టును నిరసిస్తూ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న టీడీపీ శ్రేణులు (ఫైల్ ఫొటోలు)

దందాలు జరగడం లేదు

గతంలో దందాలు జరిగాయో లేదో తెలియదు. ప్రస్తుతం పోలీస్‌స్టేషన్‌లో దందాలు అసలు జరగడం లేదు. ప్రజల పిర్యాదులు స్వీకరించి న్యాయం చేస్తున్నాము. న్యాయపరంగా ఉన్నవి కేసులు నమోదు చేస్తున్నాము. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు చట్టపరమైన సలహాలు ఇస్తున్నాము. మట్కా, ఎర్రచందనం, పేకాట తదితర అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టాము.

టి. బాబు,సీఐ రైల్వేకోడూరు

కొవిడ్ సేవలతో అరుణకు అరుదైన గౌరవం

● ఉత్తమ ఏఎన్‌ఎంగా అరుణకుమారికి అవార్డు
● విశేష సేవలకు గవర్నర్ నివాసంలో ఆతిథ్యం


గవర్నర్‌తో కలిసిన అరుణకుమారి తదితరులు

గాలివీడు, ఆగస్టు16: రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఏఎన్‌ఎంగా అవార్డు అందుకున్న అరుణకుమారికి అరుదైన గౌరవం దక్కింది. అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం నూలివీడు పీహెచ్‌సీ పరిధిలో ఏఎన్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న అరుణకుమారి కొవిడ్ సమయంలో అందించిన విశేష్ట సేవలను గుర్తించి స్వాతంత్ర దినోత్సవాల్లో భాగంగా రాజ్‌భవన్‌లో గవర్నర్ అబ్దుల్‌నజీర్ ఏర్పాటు చేసిన విందులో ఆమె పాల్గొన్నారు. రాజ్ భవన్ అధికారుల ప్రత్యేక ఆహ్వానం మేరకు విశిష్ట అతిధులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్‌తో కలిసి ఆమె పాల్గొనడం విశేషం. తోటి ఉద్యోగులు, మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్వాతంత్ర్య వేడుకల్లో నూలివీడు విద్యార్థులు

● డీజీపీ నుంచి భవిత, నసీబ్‌కు ప్రశాంసా పత్రాలు



గాలివీడు, ఆగస్టు16: విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో అత్యంత వైభవంగా జరిగిన 78వ స్వాతంత్ర్య వేడుకల్లో నూలివీడు హైస్కూల్ విద్యార్థినులు భవిత, నసీబ్ అత్యంత ప్రతిభ కనపరిచారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా పాలొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో జరిగిన మార్చ్ ఫాస్ట్‌లో స్కౌట్ అండ్ గౌడ్స్‌గా వీరు 15 రోజుల శిక్షణానంతరం రాయలసీమ జోన్ నుంచి స్టేడియంలో జరిగిన మార్చ్ ఫాస్ట్‌కు రాష్ట్ర స్థాయి భారత్ స్కౌట్స్ అండ్ గౌడ్స్ యూనిట్ కమాండర్‌గా ఎంపికై ప్రతిభ కనపర్చి డీజీపీ నుంచి పశంసా పత్రాలను అందుకున్నట్లు పాఠశాల స్కౌట్ మాస్టర్ కరకోటి చంద్రశేఖర్ తెలిపారు. పాఠశాల 40 ఏళ్ల చరిత్రలో రాష్ట్ర స్థాయిలో ఇంత ఘనతను సాధించిన విద్యార్థులను, స్కౌట్ మాస్టర్ చంద్రశేఖర్‌ను ఎస్‌ఎంసీ ఛైర్మన్ వేల్పుల జనార్ధన్, హెడ్మాస్టర్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

20న 5కే మారథాన్, క్విజ్ పోటీలు

డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ నాగరాజు

కడప(కలెక్టరేట్) ఆగస్టు16: ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ, జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో 5కే మారథాన్, క్విజ్ పోటీలు నిర్వహిస్తారని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం డీఎంఅండ్ హెచ్‌ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్, హెచ్‌ఐవీ, ఎస్టీఐపై అవగాహనలో భాగంగా ఈనెల 20న ఉదయం 5-30 గంటలకు నిర్వహిస్తారన్నారు. క్విజ్ పోటీల్లో 13-25 ఏళ్లలోపు యువత మాత్రమే పాల్గొనాలన్నారు. ఈ పోటీల్లో గెలిచిన మహిళలు, పురుషులు, ట్రాన్స్‌జెండర్స్‌కు వేర్వేరుగా మొదటి బహుమతిగా రూ. 7 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.4 వేలు ఇస్తారన్నారు. క్విజ్ పోటీల్లో విజేతలకు మొదటి బహుమతి రూ.5 వేలు, ద్వితీయ బహుమతి రూ.4 వేలు. తృతీయ బహుమతి రూ. 3 వేలు ఇస్తారన్నారు. ఈపోటీల్లో ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు, విశ్వవిద్యాలయాలు ఎన్‌ఎస్‌ఎస్ అధికారుల ద్వారా గూగుల్ లింక్ ద్వారా తప్పకుండా నమోదు చేసుకోవాలన్నారు. జిల్లా ప్రోగ్రామ్ మేనేజరు అలీహైదర్ 9177103195, శ్రీనివాసరాజు 9032888638 లేదా జిల్లా సూపర్ వైజరు ప్రసాద్ 9959550368ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో లెప్రసీ, ఎయిడ్స్, టీబీ కంట్రోల్ అధికారి డాక్టర్ రవిబాబు, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి వెంకటరామిరెడ్డి, జిల్లా క్రీడా శాఖాధికారి జగన్నాథరెడ్డి, జిల్లా యువ కేంద్రం అధికారి మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్ కేసు నమోదు


సీజ్ చేసిన ఇసుక టాక్టర్లు

లక్కిరెడ్డిపల్లె ఆగస్టు16: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్ఐ జబీవుల్లా తెలిపారు. జిల్లా ఉన్నతా ధికారుల ఆదేశాల మేరకు రామాపురం మండలం కల్పనాయుని చెరువు, మంగళంపల్లె చెరువు నుంచి మూడు ట్రాక్టర్లతో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. దీంతో దాడులు చేసి ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.10వేలు అపరాధ రుసుము వేశామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ నాగరాజు, ఈహెచ్‌సీ మోహన్‌రెడ్డి, జగదీశ్వర, నాగేంద్ర, జ్యోతి పాల్గొన్నారు

అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లు సీజ్

రాజంపేట టౌన్, ఆగస్టు 16: అక్రమ ఇసుక రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లు అదుపులోకి తీసుకున్నట్లు రాజంపేట మన్నూరు సీఐ రామాంజనేయులు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇసుక రీచ్‌లను గుర్తించలేదని తెలిపారు. ఇసుకను రవాణా చేస్తే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వం రీచ్‌లను కేటాయించేంతవరకు సంయమనం పాటించాలని కోరారు.

భారీగా గండికి చేరిన భక్తులు


శుక్రవారం రాత్రి గండికి చేరుకున్న భక్తులు

చక్రాయపేట, ఆగస్టు 16: శ్రావణ మాసోత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు సాగుతున్నాయి. మొదటి శనివారం ఎప్పుడూ లేనివిధంగా భక్తులు తరలివచ్చారు. ఇక రెండో శనివారం భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉంది. దీంతో చాలా మంది భక్తులు శుక్రవారం రాత్రికే గండి క్షేత్రం చేరుకున్నారు. వివరాల్లోకెళితే....

శ్రావణమాసోత్సవాల్లో భాగంగా రెండో శ్రావణ శనివారం భక్తులకు సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఏర్పాట్లు పూర్తిచేశారు. పందిళ్లు, షెడ్లు ఏర్పాటు చేశారు. రెండో శ్రావణ శనివారం పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రమే భక్తులు గండికి చేరుకున్నారు. వరుస సెలవులు కావడంతో భారీగా రానున్నారు. క్యూలైన్లు, ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు ఏర్పాట్లు చేశారు. ప్రధాన అర్చకులు కేసరి, ఉప ప్రధాన అర్చకులు రాజారమేష్ గర్భాలయాన్ని పూలతో అలంకరించి మూలవిరాట్టను తోమాలలతో అలంకరించనున్నారు. రెండోవారం ఇబ్బందులు పడకుండా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకున్నారు. గండికి వచ్చిన భక్తులకు కాలక్షేప కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఏదేమైనా రెండో శ్రావణ శనివారం కూడా గండికి భారీగా చేరుకుని అంజన్నను దర్శించుకోనున్నారు.

నిఘా పర్యవేక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

రాయచోటి (కలెక్టరేట్)ఆగష్టు 16: అన్నమయ్య జిల్లా కలెక్టర్ అదేశాలతో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం, 1989 అమలుకు జిల్లా నిఘా, పర్యవేక్షణ కమిటీ సభ్యుల నియామకాలు చేపట్టాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు కాకుండా వుండవలెనని, షెడ్యూల్డ్, షెడ్యూలు తెగల అభ్యున్నతి కోసం సామాజిక సేవ దృక్పథం కలిగిన వారై వుండాలి. ఒకరు రెండు పర్యాయాలు మాత్రమే ఎన్నికయ్యేందుకు అర్హులు. ఎస్సీ, ఎస్టీ, పౌరహక్కులు, అత్యాచార చట్టాలపైనా అవగాహన కలిగివుండాలి. ఇది వరకు సాఘిక సేవా కార్యక్రమాలు చేసి వుండాలి. తగిన అధారాలతో రెండు ఫొటోలు, కులధృవీకరణ పత్రం, బయోడేటాతో జతపరచి జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ, సాధికారిక అధికారి, అన్నమయ్య జిల్లా వారికి 23.8.2024 తేదీ లోపు సమర్పించవలెనని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

భార్య కనిపించలేదంటూ భర్త ఫిర్యాదు



రామాపురం, ఆగస్టు16: పాత రామాపురం వాసి వివాహిత కొరివి జయశ్రీ కనిపించలేదని ఆమె భర్త కొరివి గంగాధర ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ వెంకట సుధాకర్‌రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పాత రామాపురానికి చెందిన జయశ్రీకి చిన్నకుమార్తె ఉంది. ఆమె బుధవారం ఉదయం బంగారు కొనుగోలు చేయడానికి ఇంటి నుంచి రాయచోటికి వెళ్లిందని, సాయంత్రానికి ఇంటికి రాకపోవడంతో బంధువులకు ఫోన్ చేయగా తన భార్య ఎక్కడ ఉన్నది సమాచారం తెలియకపోవడంతో గురువారం రాత్రి పొద్దుపోయాక రామాపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రమాదంలో యువకునికి గాయాలు

పెండ్లిమర్రి, ఆగస్టు 16: శుక్రవారం ఉదయం కొత్తూరు వద్ద జరిగిన ప్రమాదంలో వేణుగోపాల్‌రెడ్డికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. కడప నుంచి వేంపల్లెకు కారులో వస్తుండగా శుక్రవారం ఉదయం కొత్తూరు సమీపాన కారు ముందు టైరుపగిలి పల్టీలు కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం కడపకు తరలించారు.

పాలిటెక్నిక్ కళాశాలలో కొత్త కోర్సులు

రాయచోటిటౌన్, ఆగస్టు16: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సెప్టెంబరు మొదటి వారం నుంచి కొత్త సర్టిఫికెట్ కోర్సులు ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శివశంకర్ పేర్కొన్నారు. ఏపీ స్టేట్ టెక్నికల్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కోర్సుల్లో చేరేందుకు ఐటీఐ, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, బీటెక్ విద్యార్థులు అర్హులన్నారు. 45రోజులు ఈ శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఏపీ స్టేట్ టెక్నికల్ బోర్డు నుంచి సర్టిఫికెట్స్ జారీ చేయబడతాయన్నారు. రాయచోటి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శిక్షణ ఇవ్వనున్న ఐఓటీ (ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్) పీఎల్‌సీ (ప్రోగ్రామబుల్ లాజికల్ కంట్రోల్) కోర్సుల్లో చేరదలచిన వారు రూ.1500 ఫీజు చెల్లించి ప్రవేశం పొందాలన్నారు. మరిన్ని వివరాలకు బుచ్చిబాబు సెల్:898512652, లక్ష్మీనారాయణ 7995279315 నెంబర్లను సంప్రదించాలన్నారు.

పశువులపై పిచ్చి కుక్కదాడి

అట్లూరు, ఆగస్టు 16: గ్రామంలో పిచ్చికుక్క దాడి చేసి 25 పశువుల మూతిపై దాడి చేసి కరిచింది. వెంటనే వైద్య సిబ్బంది పశువులకు చికిత్స చేశారని పశువుల యజమానులు తెలిపారు. మనుషులపై దాడి చేయకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

పొలతల క్షేత్రంలో వైభవంగా వరలక్ష్మీవ్రతం



వరలక్ష్మి వ్రతానికి హాజరైన మహిళలు - ప్రత్యేక అలంకరణలో లక్ష్మీదేవి అమ్మవారు

పెండ్లిమర్రి, ఆగస్టు 16: శ్రావణ మాసంలో రెండో శుక్రవారం వరలక్ష్మి వ్రతం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రం పొలతలలో వరలక్ష్మి వ్రతం ఘనంగా నిర్వహించారు. పొలతల పార్వతి సమేత మల్లికార్జున స్వామి సన్నిధిలో నిర్వహించిన వరలక్ష్మీ వ్రతానికి హాజరైన ముత్తైదువులకు వాయనాలు సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్య కలగకుండా ఆలయ ఈఓ శ్రీనివాసులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వెయ్యినూతల కోనలో...

ప్రముఖ వైష్ణవ క్షేత్రం వెయ్యినూతలకోన లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు.

కుక్కల దాడిలో గొర్రెలు మృతి



గొర్రెల కళేబరాలు

ముద్దనూరు ఆగస్టు16: మారెమ్మ కుంట సమీపంలో గొర్రెల మందపై శుక్రవారం ఉదయం కుక్కలు దాడి చేయడంతో 6 గొర్రెలు మృతి చెందగా ఒక గొర్రెకు తీవ్రగాయమైంది. గొర్రెల కాపరి రాచకుంట సూరి సమాచారం మేరకు మారెమ్మ కుంట సమీప గొర్రెల షెడ్డు పైకి కుక్కలు దాడి చేశాయి. షెడ్డులో నున్న గొర్రెల మందలోని 6గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా, ఒక గొర్రెకు తీవ్రగాయాలైనట్లు తెలిపారు. నష్టపరిహారం అందేలా అధికారులు న్యాయం చేయాలని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

గండికోట నీటిమట్టం 6.5 టీఎంసీలు


గండికోట ప్రాజెక్టులోకి వస్తున్న కృష్ణాజలాలు

కొండాపురం, ఆగస్టు 16: గండికోట ప్రాజెక్టులో శుక్రవారం సాయంత్రానికి 6.5 నీటిమట్టం డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. జీఎన్‌ఎస్ఎస్ కెనాల్ ద్వారా ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో 10,700 క్యూసె క్కులున్నట్లు డీఈ తెలిపారు. గండికోటలో నీటిమట్టం రోజురోజుకూ పెరుగుతూ వస్తోంది. 11న అవుకు రిజర్వాయిర్ నుంచి నీటిని విడుదల చేయగా ఇప్పటివరకు 4.5 టీఎంసీలకు పైగా నీరు గండికోటకు చేరింది.



WANTED
A.P. Govt. Reg. పొందిన Riyaz Promotions నందు పనిచేయుటకు 10th, ఇంటర్, డిప్లమా P/F అయిన 25 సం॥ లోపు యువతీ యువకులు కావలెను. సంపాదన : నెలకు 13000 to 25000, రూం+భోజనం ఫ్రీ, సెల్: 79893 89001 Ajc-196201

ఉద్యోగ అవకాశం
కోడూరు పట్టణంలో వున్న LG Enterprises (FMCG - ITC) నందు పనిచేయుటకు సేల్స్‌మెన్, డ్రైవర్లు, సిస్టమ్ ఆపరేటర్లు & డెలివరీ బాయ్స్ కావలెను. Qualification: 10th, Intermediate & Degree, Cell :94403 45764, 95734 51057 Ajc-196446

పాసుపోర్టు పోయినది
బద్దల లక్ష్మీదేవి భర్త బద్దల మనోహర, D.No.1/183, సత్తుపల్లి HW , పెనగలూరు మండలం,అన్నమయ్య జిల్లా, ఆంధ్రప్రదేశ్, పాసుపోర్టు నెం. U2208734, న్యాబోయిన పల్లి నుండి రాజంపేటకు మోటార్ బైక్‌లో వెలుతుండగా పోయినది.దొరికినవారు అందజేయగలరు. Ajc-000

CHANGE OF NAME
★ I, PALLA SAI PURUSHOTHAM REDDY S/O PALLA PENCHALA REDDY, R/o 97/200-4-31, Siva Sai Nagar, Utukur, Cuddapah, Andhra Pradesh - 516003 Have changed my Religion from HINDUISM to ISLAM RELIGION wef.13.08.2018 also changed my name to SHAIK MOHAMMED SAIF. AJH-54251

LOSS OF DOCUMENT
I,TIPPALURU BHARATH SAMRAT RAGHUVEER NAIDU S/o Tippaluru Rajagopal Naidu, Resident of D.No. 4/26, Potladurthi Village, Yerraguntla Mandal, Y.S.R. Kadapa District, Andhra Pradesh. 516360, have lost my Original Gift Deed Document bearing No. 3070/2020 while Going for Lone From My Home to Proddatur. If anyone found please inform at the above address AJC-000

PASSPORT MISSING
I, Peddulapalli Penchalaiah S/o P. Penchalaiah R/o D.No.2-121, Chennampalli (V)&(Po) Badvel (M), Y.S.R. Kadapa (Dt.) A.P. have lost my passport bearing No. T7028828 while travelling to Badvel Town for Xerox Purpose.If any one found please inform at the above address AJC-000

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్రః 7382114647 AJA- 189300

ఆంధ్రజ్యోతిలో ప్రకటనల కోసం సంప్రదించండి

యూనిట్ కార్యాలయం
9985411183
9985411189

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఎస్ఐగా తిరుపాల్‌నాయక్


ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన తిరుపాల్‌నాయక్

వేంపల్లె, ఆగస్టు 16: వేంపల్లె ఎస్ఐగా తిరుపాల్‌నాయక్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కడపలో పనిచేస్తున్న ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ప్రవీణ్‌కుమార్ వేములకు బదిలీ అయ్యారు.

లింగాల ఎస్ఐగా మధుసూదన్‌రావు


బాధ్యతలు చేపడుతున్న మధుసూదన్‌రావు

లింగాల, ఆగస్టు 16: మండల సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా బి.మధుసూధన్‌రావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఒంటిమిట్టలో పనిచేస్తున్న ఆయన బదిలీపై లిం గాలకు వచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు, అసాంఘికశక్తుల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు.

కడపరూరల్ సీఐగా సుబ్బరామిరెడ్డి



పెండ్లిమర్రి, ఆగస్టు 16: కడపరూరల్ సీఐగా సుబ్బరామిరెడ్డి నియమితులయ్యారు. చిత్తూరు జిల్లా నగరి రూరల్ సీఐగా పనిచేస్తున్న సుబ్బరామిరెడ్డి బదిలీపై కడప రూరల్‌సర్కిల్‌కు వచ్చారు.

'వయనాడ్‌ను జాతీయ విపత్తుగా గుర్తించండి'



విరాళాలు సేకరిస్తున్న సీఐటీయూ నాయకులు

కడప (నాగరాజుపేట), ఆగస్టు 16 : కేరళలోని వయనాడ్‌ను జాతీయ విపత్తుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నగరంలోని మున్సిపల్ స్టేడియం ఎదురుగా ఉన్న డివిజన్ కార్యాలయంలో కేరళ వాయినాడ్ బాధితుల కోసం విరాళాలు సేకరించామన్నారు. కేంద్ర ప్రభుత్వం జాతీ య విపత్తుగా వాయినాడ్‌ను గుర్తించాలన్నారు. ప్రధాని ఏరియల్ పర్యటన చేసి కూడా ఇంతవరకు ఆర్థిక సాయం అందించకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, రీజనల్ ప్రెసిడెంట్ శివశంకర్, విద్యుత్ జిల్లా నాయకులు సురేంద్రబాబు, గంగన్న పాల్గొన్నారు.

వరాలు కురిపించవే వరలక్ష్మీ మాత

● భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ● ఆలయాల్లో మహిళల ప్రత్యేక పూజలు ● కిటకిటలాడిన ఆలయాలు




సింహాద్రిపురం: నిడివెలగల ఆంజనేయస్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం... వల్లూరు: ప్రత్యేక అలంకరణలో వరలక్ష్మీదేవి.. పులివెందుల: అలంకరణలో అమ్మవారు

పులివెందుల టౌన్, ఆగస్టు 16: వరాలు కురిపించు వరలక్ష్మి మాత అంటూ ఆలయాల్లో, ఇళ్లలో మహిళలు శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అమ్మవారికి కలశాన్ని ఏర్పాటు చేసి ప్రతిమను ఉంచి వాయనాలను సమర్పించి ముత్తైదువులకు పసుపు, కుంకుమ, గాజులు, జాకెట్, పూలు అందించారు. నూతన ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న శ్రీచక్ర సహిత మహాలక్ష్మి ఆలయంలో ఆలయ 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వరలక్ష్మివ్రతం చేయడం వల్ల కలిగే ఫలితాన్ని ఆలయ అర్చకులు వివరిస్తూ కథను చదివి వినిపించారు. ఆలయ నిర్వాహకులు తూగుట్ల రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మహాలక్ష్మీ సరస్వతి దుర్గ హోమములు 108 రకాల వివిధ పుష్పాల సుగంధ ద్రవ్యాలు, పట్టు వస్త్ర వాయన సహిత మహాపూర్ణాహుతి, శిఖర కలశ సంప్రోక్షణ, మహానివేదిన భక్తులకు అమ్మవారి ప్రసాదం, కుంకుమ, గాజులు అందించారు. సంప్రోక్షణ కార్యక్రమంలో అర్చకులు హనుమంతరావు ఆధ్వర్యంలో యజ్ఞాలు, పంచాంగం రామ్‌కుమార్ శర్మచే వివిధ ప్రాంతాలకు చెందిన వేదపండితులతో పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. అమ్మవారి గ్రామోత్సవం కన్నులపండువగా నిర్వహించారు. అలాగే పట్టణంలోని అంకాళమ్మ ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. పసుపుతో లక్ష్మీదేవి ప్రతిమను ఏర్పాటుచేసి కలశాలు చేశారు. వరలక్ష్మి వ్రత మహత్య కథలను చదువుతూ పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

విజయదుర్గాదేవి ఆలయంలో...

కడప (కల్చరల్), ఆగస్టు 16 : కడప నగరం బిల్టప్ సమీపంలో గల విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారు వరలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వరలక్ష్మి వ్రతం పూజకు మహిళా భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. సాయంత్రం 6 గంటలకు విజయదుర్గమ్మకు మహామంగళహారతులు వైభవంగా నిర్వహించారు.

చెన్నూరులో...

మండల వ్యాప్తంగా మహిళలు వరలక్ష్మి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.'మహాలక్ష్మి నమోస్తుతే, సిరులు ఇచ్చే తల్లికి శిరసా నమామి' అంటూ వారి వారి కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం తెల్లవారుజాము నుంచే మహాలక్ష్మిని ఇంట్లో ప్రతిష్ఠించుకుని పూజలు, వ్రతాలు నిర్వహించారు. అమ్మవారికి ఇష్టమైన పలు రకాల పదార్థాలను నైవేద్యంగా సమర్పించారు. అలాగే మహిళలు తమ బంధువులను, స్నేహితులను చుట్టుపక్కల వారిని పిలిపించి వాయినాలు ఇస్తూ 'ఇచ్చినమ్మ వాయినం, పుచ్చుకుంటినమ్మ వాయనం' అంటూ జాకెట్, పసుపుకుంకుమ, గాజులు, పండ్లు పూలతో వాయినాలు ఇచ్చారు.

వల్లూరులో...

శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా స్వాతి నక్షత్రం రావడంతో మండల వ్యాప్తంగా వరలక్ష్మి ప్రతి ఇంటిలో ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ శుక్రవారం కావడంతో ఉదయాన్నే ప్రతి ఇంట్లో వాకిళ్ల శుభ్రం చేసుకుని అమ్మవారిని విశేషంగా అలంకరించి పసుపు కుంకుమలతో అమ్మవారికి అర్చన చేశారు. అలాగే నైవేద్యాలను పెట్టి కాయ కర్పూరంతో మొక్కులు తీర్చుకున్నారు. అలాగే తమ చుట్టుపక్కల ఉన్న మహిళలకు తాంబూళం, గాజులు అందజేశారు.

సింహాద్రిపురంలో...

మండలంలోని నిడివెలగల ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మి వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలతో పాటు సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని భక్తిశ్రద్ధలతో వ్రతం చేసుకున్నారు. శ్రావణమాసం ప్రత్యేక పూజల్లో భాగంగా ఆంజనేయ స్వామికి పంచామృతాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు, ప్రత్యేక అలంకరణ చేశారు. వరలక్ష్మి వ్రతం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరలక్ష్మీదేవిగా విజయదుర్గాదేవి

కడప (కల్చరల్), ఆగస్టు 16 :వరాలిచ్చే చల్లని తల్లి విజయదుర్గమ్మ శుక్రవారం వరలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. శుక్రవారం విజయదుర్గా ఆల యంలో వరలక్ష్మివ్రతం వైభవంగా నిర్వహించారు. ఈ పూజకు మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి వ్రతం చేపట్టారు. శ్రావణమాసం 2వ శుక్రవారం వరలక్ష్మి వ్రతం కావడంతో విజయదుర్గమ్మకు తెల్లవారుజామున విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారు వరలక్ష్మీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 10.30 నుంచి అమ్మవారి ఉత్సవ మండపంలో సుమంగళి పూజతో కూడిన వరలక్ష్మీవ్రతాన్ని భక్తుల చేత నిర్వహింపజేశారు. సాయంత్రం 6 గంటలకు విజయదుర్గమ్మకు మహా మంగళహారతులు వైభవంగా నిర్వహించారు. 8 గంటలకు అమ్మవారికి పల్లకీ సేవ నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో విజయదుర్గాదేవి... వరలక్ష్మీవ్రతంలో పాల్గొన్న మహిళలు

గజలక్ష్మి అలంకరణలో వాసవీ మాత

వేంపల్లె, ఆగస్టు 16: వేంపల్లెలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి శ్రావణమాసం శుక్రవారం వరలక్ష్మీ వ్రతం పురస్కరించుకొని గజలక్ష్మీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్యమహిళా మండలి ఆధ్వర్యంలో రంగవల్లులతో దీపాలు వెలిగించి 108 రూపాయి బిళ్లలతో లక్ష్మీ అష్టోత్తరం, లలిత సహస్రనామం, శ్రీదేవి ఖడ్గమాల స్తోత్రం పారాయణ చేస్తూ కుంకుమ పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు ప్రవీణకిషోర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


సీకేదిన్నెలో...


చింతకొమ్మదిన్నె మండలంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ

చింతకొమ్మదిన్నె మండలంలో వరలక్ష్మీవ్రతం పండుగను ఘనంగా జరుపుకున్నారు. శ్రావణమాసంలో వరలక్ష్మీవ్రతం జరుపుకోవడం ఎంతో పుణ్యప్రదమమని, కనుక మహిళలు ఈ వ్రతం ఆచరిస్తే ఎంతో మేలు జరుగుతుందన్నారు. సకల శుభాలు చేకూరుతాయని మహిళలకు ప్రగాఢ విశ్వాసం. దీంతో మండల వ్యాప్తంగా మహిళలు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించుకుని పూజలు నిర్వహించారు.


నిడివెలగల ఆంజనేయస్వామి ఆలయంలో...


పులివెందులలో అన్నదాన కార్యక్రమంలో భక్తులు



ప్రతి పాఠశాలకు క్రీడాపరికరాలు ఇవ్వాలి


మంత్రిని కలిసి మొక్కను అందిస్తున్న శివశంకర్‌రెడ్డి

కడప (స్పోర్ట్స్), ఆగస్టు 16 : విద్యార్థులు క్రీడల్లో రాణించేందుకు వీలుగా ప్రతి పాఠశాలకు క్రీడా పరికరాలు క్రీడా పరికరాలు అందజేయాలని స్కూలు అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యు కేషన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని అసోసియేషన్ తరపున కడపలో కలిసి విజ్ఞప్తిచేశారు. మంత్రిని కలిసిన వారిలో అనంతపురం జిల్లా సంఘం బాధ్యుడు నరసింహారె డ్డి, అన్నమయ్య జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుడు సుబ్రమణ్యం తదితరులు ఉన్నారు.

అనాథ శరణాలయానికి ఫ్రిడ్జ్ బహూకరణ


ఫ్రిడ్జ్ వితరణ చేస్తున్న బ్యాంకు అధికారులు

కడప (కల్చరల్), ఆగస్టు 16 : కడప సాయిబాబా అనాథ శరణాలయంలోని పేద విద్యార్థుల సౌకర్యార్థం పంజాబ్ నేషనల్ బ్యాంకు ఆధ్వర్యంలో ఫ్రిడ్జ్ బహూకరించారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు డీజీఎం అభిజిత్ సింహా కడప జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం సీఎస్ ఆర్ పథకం కింద సాయిబాబా అనాథ శరణాలయానికి చల్లని నీటి సౌకర్యం కలిగేలా ఫ్రిడ్జ్ అందించారు. ఈ కార్యక్రమంలో కడప శాఖ మేనేజరు జీఎస్ రావు, బ్యాంకు వ్యాపార విస్తరకుడు విజయనరసింహులు, రుణ వితరణ అధికారి భరత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చర్చి ఆస్తుల పరిరక్షణకు సంపూర్ణ మద్దతు

● ఆస్తులు అమ్మే హక్కు బిషప్ ఐజాక్ వరప్రసాద్‌కు లేదు
● శాప్ మాజీ డైరెక్టర్ డేనియల్ ప్రదీప్ కుమార్


మాట్లాడుతున్న శాప్ మాజీ డైరెక్టర్ డేనియల్ ప్రదీప్ కుమార్

కడప (మారుతీనగర్), ఆగస్టు 16 :రాయలసీమ అధ్యక్ష మండల సీఎస్ ఐటీఏ ఆస్తుల పరిరక్షణకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని, ఆస్తులు అమ్మడం, లీజుకు ఇవ్వడం లాంటి హక్కులు బిషప్ ఐజాక్ వరప్రసాద్‌కు ఏ మాత్రం లేదని శాప్ మాజీ డైరెక్టర్ డేనియల్ ప్రదీప్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కడప వైఎస్ ఆర్ ప్రెస్‌క్లబ్‌లో జమ్మలమడుగు కాంబెల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ అగస్టీన్ అధ్యక్షతన పీఎస్ఐటీఏ ఆస్తులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డేనియల్ ప్రదీప్ మాట్లాడుతూ ఇప్పటికే అనేక ఆరోపణలతో ఐజాక్ వరప్రసాద్ బిషప్ హోదాను కోల్పోయారన్నారు. చర్చి ఆస్తుల రక్షణ కోసం ఆయన్ను బిషప్‌గా నియమించారే తప్ప ఏది పడితే అది అమ్ముకోవడానికి కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలో చర్చిలకు మంచి రోజులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం తక్కువ మందితో పోరాటం మొదలైందని, ఇది రాయలసీమ మొత్తం వ్యాపిస్తుందన్నారు. ఈ విషయంలో కలెక్టర్, ఎస్పీ స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. లేకపోతే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, గవర్నరు దృష్టికి తీసుకెళ్తామన్నారు. కమలాపురం పాస్టర్ ఐక్యతరావు మాట్లాడుతూ ఐజాక్ వరప్రసాద్ కుటుంబ సభ్యులు లబ్ధి పొందేందుకు ఆయన్ను బిషప్‌గా నియమించలేదన్నారు. ఆస్తులను కాపాడాల్సిన బిషప్ అమ్ముకోవడం తగదన్నారు. చర్చి ఆస్తులను విద్య, వైద్యం ఆరోగ్య కోసమే వినియోగించాలే తప్ప లీజుకు ఇవ్వడం నేరమన్నారు. చర్చిల ఆస్తులు అన్యాక్రాంతం అయినప్పుడు అడిగే హక్కు క్రైస్తవులకు ఉందన్నారు. అనంతరం ప్రజాసంఘాల జేఏసీ నేతలు కారు ఆంజనేయులు, జేవీ రమణ మాట్లాడుతూ ఏ మతమైనా, ఏ సంఘమైనా ఏ కులమైనా సమస్యల్లో ఉన్నప్పుడు భారత పౌరులుగా ఆ సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత ఉందన్నారు. సదస్సుకు అధ్యక్షత వహించిన డాక్టర్ అగస్టీన్ మాట్లాడుతూ గతంలో రాయలసీమ అధ్యక్ష మండలం సస్యశ్యామలంగా ఉండేదని, కొంత మంది స్వార్థం వల్ల చర్చిల ఆస్తులు నిర్వీర్యమవుతున్నాయన్నారు. ఆస్తులను రక్షించే వరకు తమ పోరాటం ఆగదన్నారు. సమావేశంలో బండి రవికుమార్, అడ్వకేట్ అమీన్‌పీరా, జేఏసీ నేతలు అవ్వారు మల్లికార్జున, ప్రతాప్‌రెడ్డి, కైపు రామాంజనేయులు, ప్రభాకర్, శ్రీకృష్ణదేవరాయలు, రమణ, కడప, ప్రొద్దుటూరు, మైదుకూరు, జమ్మలమడుగు ప్రాంతాల సీఎస్ఐ చర్చి పాస్టర్లు పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సు ఉద్యోగాల్లో ఎస్టీలకు న్యాయం చేయాలి


వినతిపత్రం అందిస్తున్న ఎస్టీ వెల్ఫేర్ సంఘం ప్రతినిధులు

కడప (ఎర్రముక్కపల్లె), ఆగస్టు 16 : స్టాఫ్ నర్సు ఉద్యోగాల్లో ఎస్టీలకు న్యాయం చేయాలని ఆలిండియా గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కె.కొండయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ శాఖల్లో గిరిజన ఉద్యోగులుగా ఎన్నికైన ఉద్యోగులు ఇతర కులాల వారు ఎస్టీ పేరుతో ఉద్యోగాలు పొందుతున్నారని అన్నారు. ప్రస్తుతం నియమాకం జరిగే 206 స్టాఫ్ నర్సుల ఉద్యోగాల్లో ఎస్టీలకు న్యాయం చేయాలన్నరు. అలాగే వివిధ కేడరులో పనిచేస్తున్న గిరిజన ఉద్యోగులకు రోస్టరు పాయింట్ పాటించి పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సంఘం సీనియర్ నాయకులు చంద్రశేఖర్, గంగాదర్, లక్ష్మయ్య, సుంకన్న, వెంకటసుబ్బయ్య, శివశంకర్ పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించండి



మాట్లాడుతున్న రిమ్స్ డాక్టర్

కడప (సెవెన్‌రోడ్స్), ఆగస్టు 16 : పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కత్తాలోని ఆర్జికర్ మెడికల్ హాస్పిటల్‌లో జూనియర్ డాక్టరుపై జరిగిన అఘాయిత్యానికి కారుకులైన వారిని తక్షణమే కఠినంగా శిక్షించాలని రిమ్స్ జూనియర్ డాక్టర్లు డిమాండ్ చేశారు. బాధితురాలికి న్యాయం చేయాలని కోరుతూ కడప రిమ్స్ ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్లు ఆందోళన కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం జూనియర్ డాక్టర్లు రిమ్స్ ఆవరణంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో కూడా మహిళలకు రక్షణ లేకపోవడం బాధాకరమన్నారు. దేశాన్ని ఉన్నత స్థానంలో నిలబెట్టేందుకు అన్ని రంగాల్లో మహిళలు తమ వంతుగా కృషి చేస్తున్నారన్నారు. అయి తే నేటి సమాజంలో మహిళలకు భద్రత లేకుండా పోయిందన్నారు. ఈ విషయమై పాలక ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ ఆందోళనలకు ఇండియన్‌మెడికల్ అసోసియేషన్ మద్దతునిచ్చింద న్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ ప్రతినిధులు, జూనియర్ వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

కడప కమిషనర్‌ను కలిసిన జనసేన నాయకుడు


కమిషనర్‌ను సత్కరిస్తున్న జనసేన నాయకుడు తుంగా రమణయ్య

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 16:కడప నగర పాలక సంస్థ కమిషనరు వైఓ నందన్‌ను శుక్రవారం జనసేన నాయకుడు తుంగా రమణయ్య ఆయన్ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ నెల 22న మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా నగరంలో పలు చోట్ల చెట్లు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలియజేశామన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న బీటెక్ రవి

పులివెందుల టౌన్, ఆగస్టు 16: సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి అన్నారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల ప్రజలు తమ సమస్యలు చెప్పుకొని అర్జీలు అందించారు. కొన్ని సమస్యలను ఫోన్ ద్వారా సంబంధిత అధికారులకు తెలియజేసి పరిష్కరించాలని కోరారు. అన్ని వర్గాల ప్ర జల సంక్షేమమే ధ్యేయంగా టీడీపీ ప్రభుత్వం పాలన అందిస్తుందన్నారు. ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలని బీటెక్ రవి ప్రజలకు సూ చించారు. కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ జన్మదిన వేడుకలు

వేంపల్లె, ఆగస్టు 16: ఆమ్‌ఆద్మీపార్టీ అధినేత ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ జన్మదిన వేడుకలు వేంపల్లెలో శుక్రవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయంలో జిల్లా కోఆర్డినేటర్ రహమతుల్లా, జిల్లా ఉపాధ్యక్షుడు దాదాపీర్‌తమ కార్యకర్తలతో కలిసికేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అరవింద్ కేజ్రీవాల్ సీఎంగా ఢిల్లీ ప్రజలకు అందిస్తున్న పాలనను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆప్ నాయకులు హమద్, బాబబ్జి, షఫి, అబ్దుల్, రెహమాన్, చాను పాల్గొన్నారు.

దాహార్తిని తీర్చిన ప్రధానోపాధ్యాయులు


సర్వరాజుపేట కాలనీలో ఏర్పాటు చేసిన బోరు వద్ద గ్రామస్థులు

వీరపునాయునిపల్లె, ఆగస్టు 16: మండల కేంద్రమైన వీరపునాయునిపల్లెలోని సర్వరాజుపేట కాలనీ వాసులకు ప్రధానోపాధ్యాయులు ఎస్.చెన్నకృష్ణారెడ్డి చొరవతో దాహార్తి తీరింది. పంచాయతీ కార్యదర్శి నాగభూషణం రెడ్డి మాట్లాడుతూ కాలనీ వాసులకు తాగునీటి సమస్యను స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.చెన్నకృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆయన స్పందించి సొంత ఖర్చుతో బోరుబావిని తవ్వించారన్నారు. అలాగే పిచ్చిరెడ్డి ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ తరపున పనిచేస్తున్న సాజిద్ హుస్సేన్ ఆధ్వర్యంలో బోర్‌వెల్ సెట్ బిగించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ప్రజలు, నాగభూషణంరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.



అట్లూరు ఎస్ఐగా రామక్రిష్ణ



అట్లూరు, ఆగస్టు 16 : అట్లూరు పోలీసుస్టేషన్ ఎస్ఐగా బి.రామక్రిష్ణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అట్లూరు ఎస్ఐగా పనిచేసిన కేసీ రాజు బీకోడూరు పోలీసుస్టేషన్‌కు బదిలీ కావడంతో ప్రొద్దుటూరు రూరల్ ఎస్ఐగా పనిచేస్తూ బదిలీపై అట్లూరు వచ్చారు.

వైభవంగా వరలక్ష్మీవ్రతం





ఎర్రగుంట్ల.. ప్రత్యేక అలంకరణలో ఏరువాకగంగమ్మ, ఖాజీపేట...అమ్మవారిశాలలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 16: వరలక్ష్మీవ్రతం సందర్భంగా వివిధ ఆలయాల్లో మహిళలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీవ్రతం ఆచరించారు. వరాలతల్లి వరలక్ష్మి అనుగ్రహం కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో 108 మంది సుమంగళులు సామూహిక వరలక్ష్మీవ్రతం ఆచరించారు. అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరిదేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి సుందరంగా అలంకరించారు. పూజలు అనంతరం కాలక్షేప మండపంలో వరలక్ష్మి అమ్మవారిని కొలువుదీర్చి గజవాహనంపై ఆశీనులను చేశారు. మహిళలు అమ్మవారిని కలశంలోకి ఆవాహన చేసి వేద మంత్రాలతో అర్చించారు. వరలక్ష్మి దేవిని పసుపు, కుంకుమ, దీపాలు, నైవేద్యం, అక్షితలతో మహిళలు పూజించారు. వ్రతం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, పాలక మండలి సభ్యులు, ఎక్స్‌అఫియో సభ్యుడు మహేశ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు. పాత మార్కెట్‌లోని లలితాదేవి రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సామూహిక వరలక్ష్మీవ్రతం ఆచరించారు.

ఎర్రగుంట్ల..: ఎర్రగుంట్ల మండలంలోని వివిధ ఆలయాల్లో శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీవ్రతం నిర్వహించారు. ఎర్రగుంట్లలోని శ్రీ ఏరువాక గంగమ్మ ఆలయంలో శుక్రవారం సాయంత్రం సామూహిక వరలక్ష్మీ వ్రతం వైభవంగా జరిగింది. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. వందలాదిగా వచ్చిన మహిళలు అమ్మవారి కి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. భక్తులకు ఇబ్బందులు రాకుండా ఆలయ కమిటి ఏర్పాట్లు చేసింది.

మైదుకూరు రూరల్..: మైదుకూరు మున్సిపాలిటీ,మండలంలో వరలక్ష్మి వ్రతం ఆలయాలు,గృహాలలో మహిళలు ఘనంగా జరుపు కొన్నారు. పాతూరులో వెలిసిన పెద్దమ్మతల్లిని శుక్రవారం వరలక్ష్మీదేవి అలంకారంలో భక్తులు అలంకరించారు.అమ్మవారిని దర్శించుకొనేందుకు భక్తులు విరివిగా పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కాశినాయన..: మండలంలో వరలక్ష్మీ వ్రతం పండుగను మహిళలు సాంప్రదాయ బద్ధంగా జరుపుకున్నారు.కార్యక్రమంలో భాగంగా వరికుంట్ల బాలాయపల్లె గ్రామాలమధ్య వెలసిన శ్రీనీలకంఠేశ్వర స్వామి ఆలయంలో వరలక్ష్మీదేవి వ్రతం కుంకుమార్చన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.చుట్టుపక్కల గ్రామాలకు చెందిన మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు.

పోరుమామిళ్ల..: పోరుమామిళ్లలో వరలక్ష్మి వ్రతం మహిళలు ప్రత్యేకంగా పూజలు చేశారు. శుక్రవారం పోరుమామిళ్లలో వరలక్ష్మి వ్రతం సందర్భంగా శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, లక్ష్మీ వేంకటేశ్వ రాలయం, వేణుగోపాలస్వామి ఆలయంలో మహిళలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తులసి సుధాకర్, విశ్వనాధులప్రసాద్, పెనల నరసింహులు, మహిళలు పాల్గొన్నారు.

బద్వేలు..: శ్రావణమాసం శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని పురస్కరించుకుని శుక్రవారం మహిళాలు తెల్లవారుజామునుంచే భక్తి, శ్రద్ధలతో అమ్మవారికి కలశాలు ఏర్పాటు చేసుకుని పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు ఒకరికొకరు తాంబూలాలు ఇచ్చిపుచ్చుకోవడం జరిగింది. ఆలయాలకు వెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

రాజుపాళెం..: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన వెల్లాల సంజీవరాయ చెన్నకేశవస్వామి దేవస్థానంలో శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. వెల్లాల సంజీవరాయ స్వామి కల్యాణ మండపంలో ప్రత్యేక పూలతో ఏర్పాటు చేసిన కళ్యాణ మండపంలో ప్రత్యేక అలంకరణ చేశారు. వేద మంత్రోచ్చారణల మధ్య భక్తిశ్రద్ధలతో సాగింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. వ్రతానికి కావాలసిన పూలు, పండ్లు, గాజులు ఇతరత్రా అంతా ట్రస్టు ఆధ్వర్యంలో దాతల సహాయంతో ఈ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈవో నరసయ్య, టీడీపీ నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, దేవస్థాన మాజీ ఛైర్మన్లు రామసుబ్బారెడ్డి, పద్మావతి, రాంభూపాల్‌రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఖాజీపేట..: వరలక్ష్మీవ్రతాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని మహిళలు వేకువజాము నుంచే ఉపవాసం ఉండి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉపవాసంతో పూజలు చేయడం వలన వారి కుటుంబాన్ని తల్లి చల్లగా చూస్తుందని వారి నమ్మకం.



మైదుకూరులో వరలక్ష్మీ దేవి అలంకారంలో పెద్దమ్మతల్లి









ప్రొద్దుటూరు..శివాలయంలో వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్న దృశ్యం, రాజుపాలెం... వెల్లాల దేవస్థానంలో ప్రత్యేక అలంకారంలో వరలక్ష్మీదేవి, కాశినాయన, పోరుమామిళ్లలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

26న జన్మాష్టమి వేడుకలు

జమ్మలమడుగు, ఆగస్టు 16: జమ్మలమడుగులో ఈనెల 26వ తేదీ శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు త్రైతసిద్ధాంత ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈమేరకు డీఎస్పీ హుస్సేన్‌పీరాను కలిసి శుక్రవారం మాట్లాడారు. వారు మాట్లాడుతూ శ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వర్లు ఆశీస్సులతో త్రైతసిద్ధాంతం వారి ఆధ్వర్యంలో జమ్మలమడుగులో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. భక్తిశ్రద్ధలతో పండుగను విజయవంతం చేయాలని కోరారు. పట్టణంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు డాక్టర్ ఎంపీ మునిరెడ్డి కాంప్లెక్స్ వద్ద నుంచి ప్రతిమను పట్టణంలో ఊరేగింపు ఉంటుందన్నారు.

జాతీయ కీటక జనిత వ్యాధులపై అవగాహన సదస్సు

బి.కోడూరు, ఆగస్టు 16 : మండల పరిధిలోని పెద్దుళ్లపల్లె, కొండంపల్లె గ్రామాల్లో శుక్రవారం మలేరియా ఫీవర్ సర్వే వైద్యాధికారి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో జాతీయ కీటక జనిత వ్యాధులపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భగా దోమల లార్వా నియంత్రణ, దోమలను అభివృద్ధిని నియంత్రించే పద్ధతులను లార్వా అభివృద్ధి అయ్యే ప్రాంతాలను వారికి చూపించి అవగాహన కల్పించారు దోమకాటుకు గురికాకుండా దోమతెరలు, గ్రామాల్లో వేపాకు పొగ వేసుకోవాలని ఆయనకు తెలిపారు. లార్వాఉత్పత్తి ప్లాస్టిక్ డబ్బాలు, పాతటైర్లు, కొబ్బరిచిప్పలు వాటి ద్వారా దోమలు అధిక ఉత్పత్తి జరుగుతుందని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం నూర్జహాన్, ఎంఎల్‌హెచ్‌పీ అశ్విని, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు పంచాయతీ సెక్రటరీ హరీష్‌రెడ్డి పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థులకు జిల్లాస్థాయిలో బహుమతులు

ఖాజీపేట, ఆగస్టు 16: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో యల్లాప్రగడ సుబ్బారావుపై క్విజ్ పోటీల్లో మోడల్ స్కూలులో 10వ తరగతి చదువుతున్న తేజేశ్వర్‌రెడ్డి, భార్గవి, వినీల్ జిల్లాస్థాయిలో రెండో స్థానంలో నిలిచారు. వీరికి కలెక్టర్ లోతేటి శివశంకర్ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు అభినందించారు.



కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న విద్యార్థులు

భూఆక్రమణలను రెవిన్యూ అధికారులు అడ్డుకోలేరా: సీపీఐ

కాశినాయన ఆగస్టు 16:మండలంలో ప్రభుత్వ భూములను యథేచ్ఛగా ఆక్రమిస్తుంటే అడ్డుకోవాల్సిన రెవెన్యూ అధికారులు ఏమిచేస్తున్నారని సీపీఐ ఏరియా సహాయకార్యదర్శి పిడుగుమస్తాన్ ఆగ్రహం వ్యక్తంచేశారు. అంబవరం గ్రామ పొలంలోని సర్వేనెంబర్ 96 ఆక్రమణలపై శుక్రవారం నర్సాపురంలో ఆర్ఐ దక్షిణామూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబవరం గ్రామ సమీపంలో సర్వేనెంబర్ 96లో కొండపోరంబోకు భూమి వందల ఎకరాలు ఉందని. ఈభూమిని బోరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, సుబ్బరాయుడు తదితరులు యథేచ్ఛగా యంత్రాలతో చదునుచేసుకుంటుంటే రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మరోవైపు అదే సర్వేనెంబర్‌లో తెలుగంగ కాలువకు కేటాయించిన భూమి కూడా ఆక్రమణకు గురైందని దీనిని పట్టించుకొనేవారు లేరన్నారు.ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి సదరు ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేసి భూఆక్రమణను అడ్డుకోవాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యవర్గ సభ్యులు కేశవ,వెంగటయ్య పాల్గొన్నారు.

బద్వేలు పట్టణ అభివృద్ధి కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన బద్వేలుఅభివృద్ధి కమిటీ సభ్యులు

బద్వేలు, ఆగస్టు 16: బద్వేలు పట్టణ అభివృద్ధికి నూతన కమిటీని ఏర్పాటుచేసినట్లు అధ్యక్షుడు నానబాల వెంకటేశ్వర్లు, గౌరవాధ్యక్షుడు గానుగపెంట హనుమంతరావు తెలిపారు. పట్టణంలోని ప్రజలకు మౌలిక సదుపాయాలు, పట్టన అభివృద్ధి, ఇతర సౌకర్యాలపై చర్చించినట్లు ఆయన తెలిపారు. బద్వేలు అబివృద్ధి కమిటీ అధ్యక్షుడుగా నానబాల వెంకటేశ్వర్లు, గౌరవాధ్యక్షుడుగా గానుగపెంట హనుమంతరావు, కార్యదర్శిగా బద్వేలు గురుమూర్తి, సలహాదారులుగా షేక్ మహబూబ్ సాహెబ్, అసోసియేట్ అధ్యక్షుడుగా సతీష్‌రెడ్డి, వర్కింగ్ అధ్యక్షుడుగా కే.వి.సుబ్బారావు, లీగల్ అడ్వయిజర్‌గా మురళి, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. పట్టణంలో వెయ్యి చెట్లు నాటేందుకు కమిటీ బాధ్యత తీసుకున్నట్లు తెలిపారు.

రాష్ట్ర కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయండి

బద్వేలు, ఆగస్టు16: నెల్లూరులో నేడు, రేపు జరిగే సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని ఆ సంఘం కార్యదర్శి కె.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కార్మికుల, ఉద్యోగుల సమస్యలపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాల అవలభించడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయని ఆరోపించారు. ఈ తరుణంలో కౌన్సిల్ సమావేశాలు ఒక ప్రాధాన్యతతో కూడుకున్నవని కొత్తగా వచ్చిన ప్రభుత్వం కార్మికుల, ఉద్యోగుల స్కీం వర్కర్ల మరియు కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈసమావేశంలో అందరూ పాల్గొనాలని జయప్రదం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో బద్వేలు కో-కన్వీనర్ పీ.సి.కొండయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జాబ్ కేలండర్‌ను విడుదల చేయాలి

బద్వేలు, ఆగస్టు 16: రాష్ట్ర ప్రభుత్వం నూతన జాబ్ కేలండర్‌ను విడుదల చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక డీవైఎఫ్ఐ కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు మస్తాన్, పట్టణ కో-కన్వీనర్ నాగలక్ష్మి, సహాయ కార్యదర్శి ఇమ్మానుయేల్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక వికలాంగులకు అన్నదానం

ముద్దనూరు ఆగస్టు16: ప్రముఖ డాక్టర్ నవజ్యోత్‌రెడ్డి కుమారుడు, కుమార్తె పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం మానసిక వికలాంగులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.కోడిగాండ్లపల్లె సమీపంలోని మానసిక వికలాంగుల ఆశ్రమం(ఏసుకరుణాలయం)లో చిన్నారులు ధృవ నరసింహారెడ్డి,నరసింహా దేదీప్య ద్వితీయ పుట్టిన రోజు సందర్భంగా అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే బర్త్‌డే కేక్ కట్ చేసి పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నారు.



అన్నం వడ్డిస్తున్న డాక్టర్ నవజ్యోత్‌రెడ్డి

అధికారులు కదిలారు



అధికారులు రోడ్డును పరిశీలించి బ్లీచింగ్ పౌడర్ వేసిన దృశ్యం

జమ్మలమడుగు, ఆగస్టు 16: 'ఆంధ్రజ్యోతి' కథనానికి అధికారులు కదిలి వచ్చి చర్యలు చేపట్టారు. జమ్మలమడుగు నియోజకవర్గంలోని మైలవరం మండలం దొరమ్మనంద్యాల గ్రామంలో మైలవరం వెళ్లే ప్రధాన రోడ్డులో ఎస్సీ కాలనీ పక్కన మోకాళ్ల లోతు నీరు నిలబడి ఉన్నాయి. అనే కథనం ఈనెల 11వ తేదీ 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో వర్షం వస్తే ఆ రోడ్డు రొచ్చు రొచ్చు అనే కథనం ప్రచురితమైంది. శివారెడ్డి కాలనీకి వెళ్లే పాఠశాల విద్యార్థులు ఎలా వెళుతారు కథనం ప్రచురితమైంది. దీంతో సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై వర్షపునీరు ఆరిన తర్వాత శుక్రవారం ఆ ప్రాంతాన్ని సందర్శించి రోడ్డుకు, డ్రైనేజీకి కొలత వేసినట్లు దొమ్మరనంద్యాల పంచాయతీ ఇన్‌చార్జి సెక్రటరీ మాధవరెడ్డి తెలిపారు. ఎస్సీ కాలనీ దగ్గర ప్రధాన రోడ్డుపై డ్రైనేజీ కాలువ నిర్మించేందుకు వర్షపునీరు నిలబడకుండా చర్యలు తీసుకున్నట్లు వెంటనే ఆ పనులు ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. అలాగే కాపు వీధిలోని శివారెడ్డి కాలనీకి వెళ్లే రోడ్డులో సిమెంటు రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ రాజేంద్రప్రసాద్



బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 16 : బ్రహ్మంగారిమఠం పోలీసుస్టేషన్‌ను శుక్రవారం మైదుకూరు డివిజనల్ డీఎస్పీ రాజేంద్రప్రసాద్ తనిఖీ చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించి స్టేషన్‌లో పనిచేస్తున్న సిబ్బందికి సలహాలు, సూచనలు అందించారు. ప్రజలు పోలీసుస్టేషన్‌కు వచ్చినప్పుడు వారికి పూర్తి సమాచారం అందించి వారి వద్ద నుంచి ఫిర్యాదులు స్వీకరించాలన్నారు.

బ్రహ్మంగారి సన్నిధిలో డీఎస్పీ..: కాలజ్ఞానకర్త పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామిని శుక్రవారం మైదుకూరు సబ్ డివిజన్ డీఎస్పీ రాజేంద్రప్రసాద్ వీరబ్రహ్మంగారిని దర్శించుకున్నారు. ఈయనకు దేవస్థానం యాజమాన్యం ప్రత్యేకంగా ఆహ్వానం పలికి ప్రసాదాన్ని అందించారు. డీఎస్పీ వెంట బ్రహ్మంగారిమఠం ఎస్ఐ చంద్రశేఖర్, ఏఎస్ఐ గురప్ప పాల్గొన్నారు.







